# బ్రతకడం తెలియనివాడు

"నీకు బ్రతకటం తెలియదురా" అన్నారు పాపారావుతో వాడూ, అతనూ; ఆయనా, వారూ—అందరూ.

పాపారావు సమాధానం చెప్పలేదు. అతను చెప్పిన సమాధానం అందరికీ వినిపించలేదని అంటే యింకా సబబుగా వుంటుంది. ఎందుకనంటే వాళ్లు అడిగినమాట విన్న తర్వాత పాపారావు పెదవులు కదిలించాడు. కాని నాలుక కదిలించలేదు. చిరునవ్వు నవ్వాడు కాని మాట్లాడలేదు.

పాపారావుకి బ్రతకటం తెలియదు అని అనుకున్న వాళ్ళందరూ అమాయకులు గాదు; అమాయకులు కాకపోయినా, గోచీపెట్టక పూర్వం దగ్గర్నుంచి, ఆరున్నర అడుగులు పెరిగేంతవరకూ పాపారావు వేసే ప్రతి అడుగూ వాళ్ళు చూస్తూనేవున్నారు.

'ఉంగ' త్రాగటం మానకపూర్వమే వాళ్ళ అమ్మమ్మ జుట్టు పట్టుకొని పీకి వదలిపెట్టాడు. వాళ్ళమ్మమ్మ భోషాణం నిండా వెండీ, బంగారమూ వున్నాయని వాడికప్పడికి తెలుసుకోగల అవకాశాలులేపోకబట్టి యెవరూ దాన్నిగురించి అంతగా పట్టించుకోలేదు. కాని వాళ్ళమ్మమ్మ మాత్రం అనుకుంది. వీడికి తన పొడే గిట్టేటులేదు. యెంత తెలవని సన్నాసైతే మాత్రం జుట్టుపట్టుకొని అట్టావూడలాగటమేంటి?

వాళ్లమ్మ వొళ్లో పడుకొని బుల్లి చేతులు రెపరెపలాడించినట్టు తన్ను చూడగానే చేతులు రెండూచాచి చంకలోకి రాబోతే యెంత సంబరంగా వుంటుంది! తనుమాత్రం వాడి అమ్మకంటే తక్కువదా? ఆ నారాయణమూర్తి ఆయన్నెగరేసుకొని వెళ్ళకుండా వుంటే; తన కడుపునే యింకో మగకాయ కాస్తే వీళ్ల అబ్బతిప్పలూ, అమ్మతిప్పలూ కుక్కలుమాత్రం చూచేయా? తిండికి మొగంవాచి చచ్చేవాళ్లు.

అనుకున్నదిగాని వాడికింకా వూహ రాలేదుకదా అని అనుకోవటం తోనే సరిపెట్టుకుంది.

కాని వాడికి బాగుపడే బుద్ధివున్నట్టు యెక్కడా కనిపించలేదు. వాడు పాపారావుఅయ్యాడు. వాళ్ళ అమ్మానాన్న అమ్మమ్మా అందరూ కలిసేపెట్టారు వాడికాపేరు. వాళ్ళందరూ బొబ్బిలికథలు విన్నవాళ్లే అయినా తాతపేరు పాపయ్య కాబట్టి 'పాపారావు' అన్నారు.

అయినా పాపారావులో పాపయ్యగారి 'అంశ' యేమీ కన్పించలేదు. అమ్మమ్మగూడ పాపారావు తన 'దేవుడి' గుణాలేమీచూడలేకపోయింది. ఆతపన ఆవిణ్ణి మెలేసి పిండింది. తాతగారు శాంతమూర్తి; పాపారావు 'ఒరిదుడుకుపిండం'గా తయారయ్యాడు. ఈ దుడుకుతనం అనేక విధాలుగా బయట పడుతూ వచ్చింది పాపారావులో. అమ్మా, నాన్నా, అమ్మమ్మా యెవ్వరూ చూచి సహించలేనంత దూరం వెళ్ళింది.

కాస్త ఆలోచించి చెప్పాల్నంటే వెట్టివెంకడికొడుకు

సుబ్బిగాడితో గోళీలాడటం దగ్గర మొదలైందని చెప్పవచ్చు. వాడి నెవళ్ళూ గోలీలాడవద్దని చెప్పలేదే, గోళీలాడుకోవచ్చు మహారాజులాగా. వాడి యీడువాళ్లు బోలెడుమందివున్నారు వూళ్లో. వాళ్లల్లో యెవళ్తో ఆడుకున్నా అంతయిబ్బంది వుండేది కాదు. వీడి మచ్చచూస్తే ఆ వెట్టి వెంకడి కొడుకుతోనే వుట్టికట్టుకుని వూరేగాలా?

పాపారావు తండ్రి యింకో అడుగు ముందుకేశాడు. ఆయన హరిజనుల్ని దేవాలయాల్లోకితీసికెళ్ళి 'మొట్టమొదటి' వూరు అనిపించుకున్న వూళ్లో మనిషి. వాళ్ళపంక్తిని కూర్చుని భోంచేశాడుగూడాను. ఇప్పటికీ వాళ్ళ ఇంట్లో నీళ్ళన్నీ మాల వాళ్ళే తెచ్చిపోస్తారు. అయినా ఒక పెద్ద చిక్కొచ్చిపడింది. ఎనభైయేళ్ళ వెంకడు పాపారావుని "చిన్నదొరగారూ!" అని పిలుస్తుంటే, వేలెడులేని సుబ్బడొచ్చి "పాపారావ్! గోలీ లాడుకుందాం; రావోయ్!" అని అంటూంటం చూస్తే ఆయనకూడా మండింది. సుబ్బడ్ని యేమన్నా అందాం అంటే వాడు వెళ్ళి అమ్మతో అంతా పూసగుచ్చినట్టు చెబు తాడు. అదిగూడా వఠి 'రసపిచ్చిముండ'... ఇంటిమీద కొచ్చి చేటల్తో చెరుగుతుంది.

పక్కయింటివాళ్ళు వింటే పరువుచేటు. అందులో మరీ ఆ పొరుగింటి పెద్దమనిషి బ్రహ్మానందం కట్టైవిరిచినట్లు యెబ్బె ట్టుగా మాట్లాడుతాడు; నీ యింట్లో నీళ్ళు మాలవాళ్ళతో యెందుకు తెప్పించుకుంటున్నావో అందరికీ తెలుసు. వాళ్ళంటే ప్రేమగలిగీ కాదు; అంటంటే పెడమొగం వుండీ కాదు. పడ

మర చెరువు అరమైలు దూరం వుంది. యింట్లో కావలసిన పదికావిళ్లూ మోస్తే పెద్దలు గుర్తుకొస్తారని చేస్తున్నావు యీ సంస్కరణంతా! మీ పాలేరుకి పదిసోలలు వడ్లెక్కువ కొలిచావా? పదిగంటలు శలవిచ్చావా? యెందుకయ్యా యీ మోసం? ఎందుకయ్యా యీ వీభూతినామాలు?

నిజానికి యీ మాటలు బ్రహ్మానందం యెప్పుడూ అనలేదు. అయినా ఆయన వాలకంచూస్తే ఆ మాటలన్నీ అనేందుకు వెనకేస్తాడని అనుకోలేక పాపారావు నాన్నా, పాపం ఆయనకేం చెయ్యాలో గోచరం కాలేదు. అల్లుడిగారి ఆరాటాన్ని పసికట్టింది అమ్మమ్మ. ఆవిడ తల వూరికే నెరయలేదు, అందుకనే.

"చూడబ్బాయీ! మన బంగారం మంచిదైతే కంసాలి వాడేం చేస్తాడు..." అంది. ఆవిడ నోట్లో మాటలు నోట్లో వుండగానే పాపారావు గడపలో అడుగుపెట్టాడు: గోళీలాట పూర్తిచేసి వెట్టివెంకడి కొడుకుని సాగనంపి.

"ఈ సారి ఆ వెధవ లంజకొడుకు సావాసం పట్టావంటే నీ గొంతుకోసి అవతల పారేస్తా"అని గుక్క తిప్పుకోకుండా వురిమాడు పాపారావు నాన్న.

పాపారావు కుడీ ఎడమా ఏమీ చూడలేదు. చింత నిప్పుల్లావున్న నాన్న కళ్లూ చూడలేదు. నాన్న మాట్లాడుతూన్నప్పుడు నాన్న నోట్లోనుంచి తుపరలు బయటకొచ్చాయి. ఆ తుపరలుచూస్తే పాపారావుకు చిరాకేసింది. ఆ మాటలు విన్నతర్వాత వాడేమనుకున్నాడో గబగబా వంటింట్లోకి

వెళ్ళాడు. వెళ్ళినవాడు కత్తిపీట రెండు చేతుల్తోనూ యెత్తి పట్టుకొచ్చాడు వాకిట్లోకి. కత్తిపీట వాళ్ళనాన్న చేతికిస్తూ,

"చూస్తావేం? కానియ్" అన్నాడు. పాపారావు నాన్న నిర్ఘాంతపోయాడు. పైపంచ దులిపి పైన వేసుకుని గుడి వైపుకి వెళ్ళిపోయాడు.

అమ్మమ్మ మాత్రం అట్లాగే కూలబడిపోయింది. ఆవిడ దవడలూ నొక్కుకోలేదు; నెత్తీ బాదుకోలేదు. వాడి కణతలు తాకి మెటికలూ విరవలేదు. కాస్సేపటివరకూ బెల్లంకొట్టిన రాయైకూర్చుంది. అప్పుడేమన్నా లాభం వుందనుకుందో యేమో—

ఆవాళ రాత్రి వెన్నెల్లో మంచంమీద వెన్ను వాల్చినప్పుడు.

"అమ్మా కథ చెప్పవే"

అంటూ వచ్చాడు పాపారావు. "అనగా అనగా!"అని మొదలుపెట్టిన కథ "శాంతమే భూషణం" అన్నమాట బాబూ అని పూర్తిచేసింది. పాపారావు అప్పటివరకూ నిద్రపోలేదు.

"అమ్మా! భూషణంకోసమేనంటే శాంతం అంతా!" అన్నాడు వాడు. అమ్మమ్మ దవడలూ నొక్కుకుంది; నెత్తీ బాదుకుంది. అది తెలిసన్నమాటో తెలియకన్నమాటో అమ్మమ్మకి చచ్చేవరకూ అర్థం కాలేదు.

పాపయ్యగారితో సంసారంచేసిన పదేళ్ళ అనుభవమూ

మట్టిపాలు కాలేదు. దెబ్బలు తినటంలోవున్న ఓర్పూ, నగలు చేయించుకునేందుకు అన్నాలుమాని అలవాటు చేసుకున్న పట్టుదలా అమ్మమ్మలో యింకా చావలేదు.

వీడిని చదవేస్తే దారికొస్తాడేమోనన్న ఆలోచన ఆవిడక్కలిగింది. ఆ ఆలోచనతోనే వాడిని చదవేసింది అనేందుకు వీల్లేకపోయినా ఆ ఆలోచన కలక్కుండానే చదవేసింది అంటే ఆవిడ్ని అర్థంచేసుకోక పోవటమే అవుతుంది.

పాపారావు ఇంకా 'దుడుకుపిండం'గానే వున్నాడు. మాలవాణ్ణి లోపలకి రానీయని కాఫీహోటలువాడితోనూ, జీతంకట్టని కుర్రాడిని బెంచీమీద నిలబెట్టిన మాష్టారితోనూ, చదువుకునే ఆడపిల్లల్ని యేడిపించే మగపిల్లల్తోనూ వాడు 'గిల్లికజ్జా' పెట్టుకోని రోజంటూ లేకపోయింది. టవునులోకెళ్తే పంతుళ్ళూ, ఇంటి దగ్గర కూర్చుంటే వూళ్ళోవాళ్ళూ ఏదో ఒక పితూరీ చేస్తూనే వున్నారు. నాన్నకి తల తీసేసినట్లయ్యింది. అమ్మమ్మకి పార్శ్వపునొప్పి ఎక్కువైంది. ఒక్కొక్కసారి వీడి చదువు మానిపించేసి గొడ్లకాడ పెడదామా అనే సూచనల వరకూ వెళ్ళాయి నాన్న, అమ్మమ్మల సంభాషణలు.

కాని క్లాసులో యెప్పుడూ ఫస్టుమార్కులు తెచ్చుకునేవాణ్ణి చూస్తూ చూస్తూ మానిపించెయ్యాల్నంటే ఒక్క పట్టాన యెప్పుడూ యెటూ తెగలేదు.

అయినా చూస్తూ వూరుకుంటే మేస్తూ పోతాడేమో అన్న సందేహం బాధించలేకుండానూ వదల్లేదు.

వాళ్ళనుకున్నట్లు పాపారావు మేస్తూనే వెళ్ళాడు. సెలక్షనులో అందరికంటే యెక్కువ మార్కులు తెచ్చుకున్నాడు. నాన్నా అమ్మమ్మా ఆ పూట పుష్టిగా భోంచేశారు.

మర్నాడు మీటింగుందని తెలిసింది. పాపారావు నాన్నకి తప్పినవాళ్ళని గూడా పంపించాలని ఆ మీటింగు, తప్పినవాళ్ళందరూ కలిసి చేసుకుంటే, పాపారావు నాన్నకి అభ్యంతరం వుండేది కాదు. ఫస్టున పాసయిన పాపారావు మీటింగులో మిద్దెక్కి ఉపన్యాసం యెందుకియ్యాలో అర్థం కాలేదు ఆయనకి. ఎట్లాగైనా అబ్బాయిని ఇంటికి పంపించాలని నిశ్చయించుకున్నాడాయన.

"బాబూ బజార్లో కూరగాయలు కొనుక్కుని త్వరగా ఇంటికెళ్ళు, మామయ్యొచ్చాడు. ఇంట్లో కూరగాయలు మందుకూ్కడా లేవు" అన్నాడు. పాపారావు తల వూపాడు.

ఇంటికి కూరగాయలు వెళ్ళాయి గాని పాపారావు వెళ్ళలేదు.

'ఏం?' అన్నాడు నాన్న ప్రొద్దుపోయి పాపారావు ఇంటికెళితే.

"మామయ్యకి కూరలు పంపాగా!" అన్నాడు పాపారావు.

తీగ కదిలించితే పొదంతా కదుల్తుందని తెలుసు పాపారావు నాన్నకి, కుక్కిన పేనులా మళ్ళీ మాట్లాడకుండా వూరుకున్నాడు.

అమ్మమ్మ ఆశ ఇంకా చావలేదు. 'కాగే కాగే పాలు' అనుకుని వూరుకుంది. ఇంకా 'పై కెళ్ళితే' మతి మారకపో తుందా అనుకుని వూరుకుంది.

అమ్మమ్మ అనుకున్నట్టు పాపారావు మతి మారలేదు. హైస్కూల్ వదలి కాలేజీల్లో చేరినా మారలేదు. అతనికి చదువంటే వ్యర్థమనిపించింది. క్లాస్ పుస్తకాలు చదవటం మానేశాడు. మనిషి యెందుకు పుట్టాడో సంఘం యెందుకు పుట్టిందో అని తెలుసుకునేందుకు అవసరమైన పుస్తకాలన్నీ వెదికి వెదికి చదవటం మొదలుపెట్టాడు. అవి అర్థం కాందే ఈ సంఘాన్ని మార్చలేమనీ, సంఘాన్ని మార్చందే యీ చదవాల్సిన చదువు అక్కరకు రాదనీ అనటం మొదలు పెట్టాడు—అదేమన్నవాళ్ళతో.

దూరాన వుంటంవల్ల యీ సంగతులన్నీ ఆ నోటా ఆ నోటా పడి పాక్కి పాపారావు నాన్న చెవిలో పడేందుకు కొంతకాలం పట్టింది.

ఇదంతా విన్న అమ్మమ్మ లోకానుభవాన్నంతా వెళ్ళ గక్కింది. చదువుకున్న వాడికన్న ... మెరుగనీ, చదవేస్తే వున్న మతి గూడా పోతుందనీ ఆవిడకిదివరకే తెలుసు. అవన్నీ ఇవ్వాళ అక్షరాలా ఋజువయ్యినందుకు ఒకవిధంగా ఆవిడ సంతోషించింది గూడాను.

ఇల్లరికంలో వున్న పాపారావు నాన్న అమ్మమ్మ ఆలోచనల్ని అంగీకరించాడు. పాపారావుతో పాటు చిన్న వాళ్ళని గూడా చెడగొట్టటం అంటే ఆయన మనసొప్పలేదు.

ఎంత మేడ్చినా నెత్తురు పంచుకుని పుట్టాడు కాబట్టి ఒకటి రెండుసార్లు చీదేవాడు. ఆయన పై పంచె భుజానేసుకుని పట్ట ణానికి బయల్దేరబోయే ముందు అమ్మమ్మ భోషాణం కొట్ట బోయినట్టు కళ్ళముందు కన్పించింది.

పట్నం వెళ్ళి పాపారావు 'నల్లువ్వానాం' చేద్దామను కున్న పాపారావు నాన్న తనంత పొడుగౌతున్న కొడుకును చూచి ఆ ఉద్దేశాన్ని విరమించుకున్నాడు. కాని అనదలచు కున్న మాటలూ, అనగూడని మాటలూ కొసరుకూడా మిగల్చకుండా అనేశాడు: పాపారావు తన కడుపున చెడ బుట్టాడు. చూచినవాళ్లెవరూ తన కొడుకనుకోరు. కాళ్లా వేళ్లా బడి తన అమ్మమ్మని బ్రతిమాలుకుని ఇంట్లో పెట్టుకుంది పాపారావులాంటి తన బిడ్డలకోసమేగా! పెళ్ళయిన దగ్గర్నుంచీ తను చేసిందంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఇంక పాపా రావు తన ఇంట్లో అడుగుపెట్టేందుకు వీల్లేదు. చదివిన పుస్త కాల దగ్గరకే పోయి కూడు గుడ్డా పెట్టకొమ్మని బ్రతిమాలు కోవాలి పాపారావు.

పాపారావు నదర లేదు. బెదర లేదు.

"నీ యిష్టం" నాన్నా అన్నాడు.

ఇంతవరకూ చాటునా మాటునా 'పాపారావు చెడి పోతున్నాడు' అన్నవాళ్ళందరూ ఇప్పుడు పబ్లిగ్గా అనడం మొదలుపెట్టారు. పాపారావుకి బ్రతకటం తెలియదు. తెలిస్తే వాడింత తెలివితక్కువ పని చెయ్యడు. వాడు చదువుకుని బాగుపడితే అమ్మమ్మ భోషాణంలో అధమం

సగం అన్నా వాడికి దక్కేది. దక్కించుకోవటం చేతకాని వాడికోసం ఏడుపు కక్కేదెవడు?

తరువాత పాపారావు చాలాకాలం బ్రతికాడు; చాలా పనులు చేశాడు. ఇనప ముక్కన్నమాట. దొరకనప్పుడు రైతులకి పట్టాలూ, పారలూ పలుగులూ ఇప్పించాడు. దొరికిన బత్తేలతో బ్రతుకు సాగనివాళ్ళు సమ్మెలు చేయించి బత్తేలు ఎక్కువ సంపాయించుకునేట్టు చేశాడు. ఇలాంటివే ఇంకా యెన్నో చేశాడు; చేయించాడు. అయినా పాపారావుకి బ్రదకటం తెలియదు అన్నవాళ్ళ నోళ్ళకి తాళాలు పడలేదు. పాపారావు చచ్చేంతవరకూ ఆ మాట అంటూనే వున్నారు.

అతను చనిపోయాడంటే నేను నమ్మలేదు. అతను యింకా నా కళ్ళకు కట్టినట్లు కనబడుతూనే వున్నాడు. కాని చావువార్త మోసుకొచ్చిన వాళ్ళు చెప్పే ఋజువులు చూస్తూంటే నమ్మక తప్పటంలేదు.

ఈ మధ్య గ్రామాల్లో గల్లంతులు ప్రారంభమైన సంగతి నాకూ తెలుసు. తన్నులాటలు యెక్కువైపోయాయి. అదునుచూచి అందలా లెక్కలనుకునేవాళ్ళు యిదివరకటి కంటే యెక్కువైపోయారు. ఇదంతా చూస్తూన్న పాపారావుకి కంపరమెత్తింది. ఇంతకాలం తానూ తనలాంటివాళ్ళు కష్టపడి చేస్తూన్న కార్యక్రమమంతా బుగ్గిపాలౌతూండటం చూడలేక పోయాడు.

ఇంతవరకూ వూళ్ళోవున్న తలకీ, మొలకీ మాసిన

రౌడీల కందరికీ అతనంటే సింహస్వప్నం. వూళ్లోవాళ్ళందరూ "వాళ్ళతో మనకెందుకు? అన్నీ చెడినవాళ్ళు. వాళ్ళు ఏదన్నా చెయ్యగలరు. మనం సంసారులం. వాళ్ళు అన్నిటికీ తెగించినవాళ్లు." అనుకుంటూ ముఖంమీద వుమ్మిపడినా తుడుచుకుని పోతూండేవారు. పాపారావు అట్లా అని వూరుకోలేదు. ఊళ్లో మీసాలు మొలుస్తూన్న వాళ్ళందరినీ ఒక జట్టుచేసి ఒకటి రెండు సార్లు ఇద్దరి ముగ్గురి రౌడీలకు బుద్ధి చెప్పించి విననివాళ్ళకి శాస్తి చేయించాడు. అప్పటినుంచీ వాళ్ళు కాస్త వళ్ళు దగ్గరవుంచుకొని ప్రవర్తించటం మొదలు పెట్టారు. కాని—

ఇప్పుడు వాళ్ళని పట్టేందుకు పగ్గాలేకుండాపొయ్యాయి. శాంతి, అహింసల ధర్మప్రచారం చేసేవాళ్ళకి దౌర్జన్యాన్ని, నిరంకుశత్వాన్నీ, దుర్మార్గాన్నీ, అశాంతినీ, హింసనీ మచ్చిక చేసుకోనిదే ధర్మసంస్థాపనం చేయటం సాధ్యం కాక పోయింది. అందుచేత తప్పనిసరిగా వాళ్ళు కొన్ని పనులు చేయటం మొదలుపెట్టారు. అందులో కొన్ని వున్న గింజల్ని కిరసనాయిల్‌తో అంటించి తగలబెట్టి, ఆహారసమస్యను తీర్చటం, అదేమన్న వాళ్ళని చింతబరికెల్తో చావమోది, చితకతన్ని వ్యక్తిస్వాతంత్ర్యాన్ని నిలబెట్టటం, అడ్డమెళ్ళినవాళ్ళని హాత మార్చటం. యివన్నీ చూచి దవడలు నొక్కుకొని, నోళ్ళల్లో కొంగులు పెట్టుకుని, గుడ్లనీళ్ళు గుడ్లగుక్కుకునే ఆడవాళ్ళని అనగూడని మాటలన్నీ అని, వీలుంటే కొప్పులు లాగి, గుడ్డలు పెరికి, మానాన్ని అపహరించటం, అలా వారి హృదయంలో స్త్రీకున్న వున్నత స్థానాన్ని వెల్లడి చేయటంలాంటివి కొన్ని!

అయితే యివన్నీ చేయటం ఏమంత 'అల్లాటప్ప' పని కాదు. అందుచేత యీ ధర్మసంస్థాపకులు కొందరి సహాయాన్ని అర్థించారు. అదనుచూచి అందలాలెక్కేవాళ్ళు వీళ్ళ కారుల్లో యెక్కారు. ఇంతకు పూర్వం బుద్ధి చెప్పించుకున్నవాళ్లూ, శాస్తి చేయించుకున్నవాళ్ళూ కుడిచేతులై నిలబడ్డారు......

ఎవ్వరూ ఏమీ చెయ్యలేకపోయారు. మెదిలిన వాడి మీద పడతారేమోనని అందరూ అల్లల్లాడి పొయ్యేవాళ్ళే.

పాపారావు ఒక్కడూ మనిషిలా నిలబడ్డాడు. భయపడితే లాభం లేదన్నాడు. మీ బ్రతుకు మీరు బ్రతకలేక పోయింతర్వాత బ్రతికి లాభమేమిటన్నాడు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బ్రతికేకంటే ప్రాణాల్లేకుండా బ్రతకడమే మంచిదన్నాడు. ఇవ్వాళ పొరుగుయింటి పడుచుల చేతులు పట్టుకున్నవాళ్ళు రేపు మీ వాళ్ళని వదుల్తారని యెలా అనుకుంటారన్నాడు.

"ఒరేయ్ బాబూ! నీకు బ్రతకటం తెలియదురా" అన్నారు అమాయకులు కానివాళ్ళు.

చావటం చేతకానివాళ్ళకి బ్రతకటం అంటే ఏమిటో తెలియటం కష్టమేమో అన్న అనుమానం కలిగింది పాపారావుకి. మారే పరిస్థితుల్లో చావు - బ్రతుకులు చోటులు మార్చుకుంటాయి. వీళ్ళందరూ చావంటే వున్న భయంతో బ్రతుకున్నారు గాని బ్రతుకంటే వున్న మమతతో కాదు.

పాపారావు కిదంతా చూస్తే చిరాకేసింది, అసహ్యం పుట్టింది. ఏమైనాసరే వీళ్ళ ఆటల్ని అరికట్టాల్నని అనుకున్నాడు.

వాళ్ళ కార్యక్రమానికి అడ్డం వెళ్ళాడు. అతనితో పాటు, అతనుచేసే పనంటే అభిమానం వున్నవాళ్ళందరూ వెళ్ళారు.

ధర్మ సంస్థాపకులు గుడ్డ లూడదీసుకున్నారు. శాంతి సంస్థాపనకోసం పాపారావునీ పాపారావులాంటి వాళ్ళనీ భూస్థాపితం చెయ్యాలనుకున్నారు. కార్యక్రమం ప్రారంభం అయింది.........

పాపారావుమీదా పాపారావు లాంటి వాళ్ళమీద ధర్మసంస్థాపకులు యుద్ధం ప్రకటించారు, తుపాకులు పేల్చారు. పాపారావుగూడా తుపాకి పేల్చాడు.

"అదే పొరపాటు!" అన్నారు నాయకులు కానివాళ్ళు; అమాయకులు కానివాళ్లూ. వాళ్ళు సంస్థాపకులు కాబట్టి కాల్చారు; ఇతనుగూడా కాల్చడంయేమీ బావుండ లేదన్నారు. "ఇవ్వాళ వాళ్ళమీద కాల్చాడు. రేపు మా మీద పేల్చ డని యెలా నమ్మతాం;" అన్నారు ఆ అమాయకులు కాని వాళ్ళు.

సంస్థాపకుల స్వైరవిహారం తగ్గింది. తాత్కాలికంగా తిరోగమించారు. కాని వాళ్ళు కాల్చిన తుపాకి పాపారావును బలికొన్నది.

తిరోగమించినవాళ్ళు తిరిగి రారనే నమ్మకం యెవరికీ కుదరలేదు. అయినా వాళ్ళ పస అందరికీ తెలిసిపోయింది. తుపాకీ పేల్చేవాళ్ళమీద తుపాకి పేల్చేందుకు జంకనివాళ్ళు చాలమంది తయారయ్యారు. వీళ్లందరూ.

"బ్రతికితే పాపారావులా బ్రతకాలి"అంటారు.

అమాయకులు కానివాళ్ళకి యిదంతా చూస్తూంటే 'అయోమయంగా'నే వుంది యిప్పటికూ్కా-డా.

— ।०। —